# వీర సహోదరులు

మృత్యు దేవత అతి నిర్దాక్షిణ్యంగా తనను మింగి వెయ్యాలని తహతహలాడుతున్నదన్న సంగతి ఆ మహా విప్లవ వీరుడికి తెలుసు! ... అయినా వీరోచిత హాస వదనంతో ఉరి కంబాన్ని సమీపించేడు. అతని నేత్రాలలోంచి వెలువడుతున్న దివ్య తేజస్సు అక్కడున్న భారతీయులందరినీ ఉత్తేజితుల్ని చేసింది! చేతులు జోడించి ఆ మహా విప్లవ వీరుడికి హృదయ పూర్వకంగా నమస్కరించేరు.

ఆ దృశ్యాన్ని చూసేసరికి అక్కడున్న ఆంగ్లేయాధికారుల హృదయాలు కోపోద్రేకంతో కుత కుతలాడిపోయేయి.

"ఇక కొద్ది క్షణాలలో మృత్యుదేవత నీ కంఠానికి ఉరి త్రాడు బిగిస్తుంది! ... ఇప్పటికైనా నీకు తెలిసిన యితర విప్లవకారుల పేర్లు చెప్పినట్లయితే యీ లోకంలో అన్నింటి కంటే విలువైన ప్రాణాల్ని నీకు మేము బహూకరిస్తాము. ఇంకా సమయం మించిపోలేదు. చెప్పు? ... ఇతర విప్లవకారుల పేర్లేవిటి?" అని ఓ ఆంగ్లేయాధికారి ఆ విప్లవ వీరుని వేపు అతి క్రూరంగా చూస్తూ అడిగేడు.

ఆ మహావీరుడు అణుమాత్రమైనా చలించలేదు. రవ్వంతైనా భయపడలేదు. ఆ ఆంగ్లేయాధికారి వేపు తీవ్రంగా చూస్తూ "ప్రాణాలమీద తీపితో ననుగన్న తల్లియైన భారత మాతకు ద్రోహం చేసేటంతటి నీచుణ్ణి కాను! పరమేష్టి నిర్ణ

యానుసారం దుర్భర పరిపీడనకు ఆహుతై పరమ జుగుప్సా కరమైన దాస్యానికి ఈనాడు లోనయింది మా దేశమాత! చాలా కాలంనుంచీ ఎన్నో కష్టాలనుభవిస్తున్న కారణంగా ఎంతో క్షమాశీలం మా కలవడింది. విధి నిర్ణయానికి తల ఒగ్గి ఎన్నో అన్యాయాలను, అవమానాలను యింతవరకూ సహించేము. విధి లిఖితం ఎల్లకాలం ఒకేలాగుండదు. పరమేశ్వరుని ఆజ్ఞ అయింది. ఇక యీ అన్యాయాలను, అవమానాలను సహించ లేము. జీవితంలో ప్రాణభిక్ష కోరవలసిన సందర్భాలు కొన్ని వుంటాయి! ... కాని ఈ సందర్భం అటువంటిదికాదు. ఇది ప్రాణత్యాగం చెయ్యవలసిన సమయం! ... నా యీ ప్రాణ త్యాగం భారత దేశంలో విప్లవ జ్వాలలను మరింత తీవ్రతరం చేస్తుందనే సత్యాన్ని త్వరలోనే మీరు గుర్తిస్తారు!" అని యెంతో ధైర్యంగా అన్నాడా విప్లవ వీరుడు.

ఆ తరువాత మృత్యుదేవత అతని కంఠానికి ఉరి త్రాడు బిగించడానికి మరి ఆట్టే ఆలస్యం చెయ్యలేదు!

అమరుడయ్యాడా మహా వీరుడు! ...

ఆ మహా విప్లవ వీరుని మరణంతో దానపూర్‌లో అంతవరకూ ఆంగ్లేయాధికారులకు విధేయులై యున్న భారతీయ సైనికులందరిలోను నిద్రాణమైయున్న జాతీయభావం ఒక్క మారుగా బయటకుబికింది! ... జ్ఞానదేవత వారికి కర్తవ్యాన్ని ప్రబోధించింది!

కంపెనీ దుస్తుల్ని గిరవాటువేసి జగదీశ్‌పూర్ అర ణ్యాలవేపు వీరావేశంతో బయలుదేరేరు. అక్కడొక భారతీయ రాజ కిశోరం అతి భీకరంగా గర్జిస్తోంది.

ఆంగ్లేయులు ఔధ్ సంస్థానాన్ని కబళించిన తరువాత హిందూదేశంలోగల స్థానిక రాజ వంశాలను నిర్మూలించ డానికి ఒక ఉద్యమాన్ని ప్రారంభించేరు. ఆ ఉద్యమంలో ఆ రాజ కిశోరంయొక్క ప్రాంతంకూడా కబళించబడింది.

తన ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అన్యాయంగా నాశనంచేసిన ఆంగ్లేయులకు ఈ భారత భూమిపై నిలువ నీడ లేకుండా చేస్తానని ప్రతిజ్ఞచేసిన ఆ వీర కిశోరం ఎవరో కాదు! ... ప్రఖ్యాత రాజ పుత్ర వంశములో జన్మించిన కుమర్‌సింగ్ అతడు! ఎనభై ఏళ్ళ వృద్ధుడైనప్పటికీ యుద్ధ ప్రసక్తి వచ్చేసరికి యౌవన తేజం అతనిలో ప్రస్ఫుటమవు తూంది.

మాతృ దేశ భక్తి ప్రేరితులై వచ్చిన దానపూర్ సిపాయిలను చూడగానే కుమర్‌సింగ్ పరమానంద భరితు డయినాడు. ఆ వీర సైనికులకు హృదయపూర్వకమైన ఆదరాభిమానాలతో స్వాగతమిచ్చేడు.

"కుమర్‌సింగ్‌కి జై!" అనే జయ జయ ధ్వానాలతో ఆ అరణ్యమంతా ప్రతిధ్వనించింది. ఆ సైనికుల వీరావేశము కుమర్‌సింగ్‌ను ఎంతో ఉత్తేజితుణ్ణిచేసింది. గంభీరమైనస్వరంతో "ఓ ప్రియమైన సోదర వీర సైనికులారా!" అని యెంతో

ప్రేమాభిమానాలతో సంబోధించి ఇలా హెచ్చరించేడు ...
“ఈ ప్రపంచంలో కర్మభూమి అని ప్రసిద్ధికెక్కిన మన దేశంలో ఔదార్యం, సౌజన్యం, సౌహార్ద్రం వీటన్నిటికీమించి ఆత్మావలోకనం, ఆధ్యాత్మికత్వం పరమోత్కృష్టమైన స్థానాన్ని పొందేయనడంలో అతిశయోక్తి లేదు! ...

మహత్తరమైన ఈ భారతజాతి కొన్నివేల సంవత్సరాల క్రితమే ఇతర ప్రపంచ దేశాలలో తన సంస్కృతిని వెదజల్లి విజయ పతాకలను యెగురవేసింది. కాని విధి ఎదురు తిరిగిన కారణంగా సర్వత్రా వ్యతిరేక వాతావరణం యేర్పడడంవల్ల ఆ విజయ పతాకలు చిరిగి చిరిగి కాలగర్భంలో కలిసిపోయేయి! అయినా మన అదృష్టవశాత్తూ ఇంకా మిగిలివున్న మన వేద వేదాంగాలు, ఉపనిషత్తులు, స్మృతులు, వివిధ శాస్త్రాలు, పురాణేతిహాసాలు మన జాతి ప్రాచీన మహోజ్వల చరిత్రను వేనోళ్ళ చాటుతున్నాయి.

కాని నేటి భారతజాతివేపుచూస్తూంటే కడుపు తరుక్కుపోతూంది. స్వబుద్ధి రవ్వంతైనాలేని నీచ బానిసలై గతాన్ని గురించిన గర్వంగాని, ఉజ్వలమైన భవిష్యత్తుగురించి ఆశగాని లేకుండా ఏదోవిధంగా బ్రతుకు వెళ్ళబుచ్చడమే తమ ధ్యేయమన్నట్లు బ్రతుకుతున్నారు!... ఆత్మాభిమానం, ఆత్మవిశ్వాసం నశించినందువల్ల సర్వత్రా నైరాశ్యం క్రమ్ముకుపోయిందీనాడు. వంచన, ద్రోహం, కుతంత్రం స్వీయరక్షణోపాయాలుగా స్వీకరించబడుతున్నాయి! కరడుగట్టిన స్వార్థంతో విదేశీయుల

పాదధూళి నెత్తినిదాల్చడానికి ఏమీ సిగ్గుపడనివాళ్ళు మనలో తయారయేరు !... దుర్బలులకు, పరమ మూఢులకు మాత్రమే తోచే జుగుప్సాకరము, నీచము అయిన దైన్యంతో ఘోరాతి ఘోరంగా పతనమయిపోతున్నారు.

తమ నాగరికతను చూసి భ్రమసిపోయి భారతీయులు పాశ్చాత్య నాగరికతా వ్యామోహంలో పడతారని, వేద వేదాంగాలకన్న బైబిలు ఘనమైనదని భావిస్తారని, తమ పవిత్ర దేవాలయాలను వదిలి చర్చిలలో ప్రోగవుతారని ఆంగ్లేయులు ఆశించేరు. వారు ఆశించినదానికి అనుగుణంగా స్వధర్మభ్రష్టులైన మూర్ఖులు కొంతమంది యీనాడు వారి పై పై తళుకు బెళుకులను చూసి భ్రమసిపోయి వారి అడుగులకు మడుగులొత్తుతున్నారు.

క్రొత్తగా సంపాదించిన శక్తులతో రాజ్యకాంక్షే లక్ష్యంగా పెట్టుకొని అన్యాయంగా, అక్రమంగా, దౌర్జన్యంగా ఇతర దేశాల నాక్రమించడమే పనిగా పెట్టుకున్నారు. పాంచభౌతిక జగత్తే సత్యమని నమ్మి జన్మాంతరాలున్నాయనే వివేకమే లేక దేహాత్మవాదులై తుచ్ఛము, నీచము, పాపభూయిష్ఠము అయిన యింద్రియ సౌఖ్యాలకోసం మానవత్వాన్ని కోల్పోయి విజయగర్వముతో విర్రవీగుతున్న ఆంగ్లేయుల ఆధిపత్యాన్ని యీ పవిత్ర భారత భూమిపై అంతమొందించవలసిన సమయమాసన్నమైంది!

మన దేశీయులందరిని క్రైస్తవులుగా చేసి వెయ్యాలని ఈస్టిండియా కంపెనీవారు చాలా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అవకాశందొరికినపుడల్లా మన మతాన్ని అతి నీచంగా జుగుప్సాకరంగా విమర్శిస్తున్నారు. మన హిందూ మతస్థుల కున్నంత మత సహనం ప్రపంచంలో మరి ఏ యితర మతస్థులకి లేదనడంలో అతిశయోక్తి లేదు!... ఈ మహోత్కృష్టమైన సుగుణాన్ని మన బలహీనతగా భావించి మన మతాన్ని నాశనం చెయ్యడానికి యితర మతస్థులు ప్రయత్నిస్తున్నారు. మత ప్రచారముకోసం కోట్లకొద్దీ ధనాన్ని మన దేశంలో కుమ్మరిస్తున్నారు!...

ఒకసారి భారత దేశపు సంస్కృతి, మత ధర్మాలు నశిస్తే భారతీయులలో జాతీయత మంటగలిసిపోతుందని వారికి తెలుసు!... జాతీయతతోపాటు జాతి వ్యక్తిత్వంకూడా నశిస్తుంది. వ్యక్తిత్వం నిలుపుకోవాలనే పట్టుదలగల జాతిని పరిపాలించడముకన్న వ్యక్తిత్వాన్ని కోల్పోయిన జాతిని పరిపాలించడం చాలా తేలిక! ఇది మత సంబంధమైన విషయం కాదు. ఇది కేవలం రాజకీయలౌక్యానికి సంబంధించిన విషయం. ఈ లౌక్యాన్నే ఆంగ్లేయులు యీనాడు మన జాతిపై ప్రయోగించుచున్నారు. మనమంతా నీచ మతస్థులమని వారు ప్రచారము చేస్తూంటే సిగ్గెగ్గులు మానావమానాలు విడిచిపెట్టి వారి పాదసేవ చెయ్యడం మహా జుగుప్సాకరమైన నీచ కార్యం.

ఎన్నో అవమానాలను, అపనిందలను భరించుచూ, తిట్లు, తన్నులు తింటూ ఎవరేం చేసినా సహించుచూ, ఇదేదో

మహోత్కృష్టమైన శాంతియుత సహజీవనమనే అభిప్రాయముతో యిలా కిక్కురుమనకుండా పడివుంటే మన జీవితం నరకప్రాయమవుతుంది.

ఇతరులకు మేలుచేసే స్వభావం మనది! ... నిజమే — కాని మనకెవరైనా తీవ్రమైన అపకారం చేసినప్పుడు సహించి పడివుండడమనేది మన చేతకానితనానికి ఓ నిదర్శనమవుతుంది. అందుచేత మన కపకారంచేసే దుర్మార్గుల నంత మొందించడమే మన ధర్మం. ఈ స్వధర్మాన్ని మనమెన్నడూ విస్మరించరాదు! లేవండి! ... శత్రువులను నిర్జించండి! భగవద్గీతోపదేశాన్ని మరచిపోకండి! స్వధర్మ రక్షణాకై నడుంకట్టండి! ... పదండి ముందుకు! వాయు వేగంతో ముందుకు దూసుకు పోదాం పదండి! ... జై హింద్!" అంటూ కుమర్ సింగ్ తన శ్వేతాశ్వంపైకి ఛెంగున ఎగిరి కూర్చున్నాడు.

"హర హర మహాదేవ!" అంటూ సైనికులంతా మహోత్సాహంతో యుద్ధసన్నద్ధులయేరు!

వారిక బయిలుదేరుతారనగా ధవళ వస్త్రాంబరధారిణి, దివ్య తేజస్విని అయిన ఒక యువతి శ్వేతాశ్వంపై ఎదురుగా వచ్చి "ఆగండి! యుద్ధంచేసి ఆంగ్లేయులను జయించగలిగే స్థితిలో మనమిప్పుడు లేము. అందుచేత వెనక్కు మరలండి." అని నిరుత్సాహపరిచింది.

అదొక అశుభ సూచనని కొంతమంది భావించేరు.

కుమర్‌సింగ్ ఆ యువతిని సమీపించి ఆమె తలమీద గోముగా నిమురుతూ "శాంతీ! ... రాజ్యకాంక్షాపరులైన ఆంగ్లేయులు శాంతియుతమైన సంప్రదింపులద్వారా మన దేశాన్ని వదిలిపెట్టి పోతారనుకోవడం అవివేకం! దెబ్బకు దెబ్బతీసి వాళ్ళని యీ దేశములోంచి తరిమెయ్యాలి!" అని అన్నాడు.

"ప్రభూ! ... అందుకిది సమయంకాదు. సమయాసమయాల నెరిగి ప్రవర్తించడం వివేకవంతుల లక్షణం! నేడు ఆంగ్లేయులు ఆధునాతనమైన ఆయుధాలతో మంచి శక్తివంతులై యున్నారు. వారికివి మంచి అదృష్టదినాలు! భగవంతుడు వారికి అనుకూలముగా ఉన్నాడు. ఈ పరిస్థితిలో వారిని యెదిరించి జయించడం అసంభవం!... వీరావేశంతో యుద్ధానికి తలపడితే అనర్థమే సంభవిస్తుంది! ... మన దేశీయులు ప్రాణభీతిలేని ఎంతటి మహావీరులైనప్పటికీ ఆంగ్లేయుల శక్తివంతమైన నూతనాయుధాలముందు శలభాలవలె మాడిపోతారు. అందుచేత యుద్ధానికిది సమయంకాదు! ... దేశ స్వాతంత్ర్య సముపార్జనకు అహింసాయుతమైన సమరాన్ని సాగించడం మంచిది!" అని సలహాయిచ్చింది శాంతి.

శాంతియొక్క యీ సలహా యుద్ధోన్ముఖులై యున్న ఆ వీర సైనికులెవ్వరికీ నచ్చలేదు.

శాంతిని పరిహాసించేరు!

ఆమె వేపు జుగుప్సాకరంగా చూసేరు!

"మహోజ్వలంగా ప్రజ్వరిల్లుతున్న విప్లవాగ్నిని చల్లార్చ డానికి ప్రయత్నించడం విప్లవ విద్రోహమే అవుతుంది." అని అరిచేడొక వీరుడు.

శాంతి ప్రశాంత వదనంతో ఆ వీరుడి ముఖంలోకి చూస్తూ "నిస్వార్ సింగ్!... నేను విప్లవ విద్రోహురాలను కాను. భారతమాత దాస్య శృంఖలాలను ఛేదించడానికి నా ప్రాణాన్ని అయినా సమర్పించడానికి నేను వెనుకంజ వెయ్యాను. కాని యుద్ధానికి నేను సుముఖురాలను కాను, ఈ మహాత్కా ర్యాన్ని శాంతియుతమైనపద్ధతిలో సాధించాలని నా సంకల్పం" అన్నది స్నిగ్ధ కంఠంతో.

"క్షాత్ర తేజము, బ్రహ్మ తేజము విజృంభించవలసిన ఈ సమయంలో శాంతికాముకతతో మనం తిరోగమించినట్లయితే మనం యింతకంటే అధికంగా అణగద్రొక్క వెయ్యబడతాము. మనం దైహికంగా దుర్బలులం కాదన్న సంగతి ప్రపంచానికి తెలియజెయ్యాల్సిన సమయమాసన్నమైంది. ఇంకా మనం మీన మేషాలు లెక్కపెడుతూ కూర్చుంటే యిక తల ఎత్తడానికి కూడా వీలులేనంత ఘోరంగా అణిచివేయబడతాము. మనకు కావలసినవి; రక్తంలో శక్తి, నరాల్లో బలము, వజ్రకఠినమైన మనోనిశ్చయంకాని శాంతి అనేపేరుతో నీరసపరిచే భావాలు మాత్రంకావు!" అని నిస్వార్ సింగ్ మరింత ఉద్రిక్తుడై అన్నాడు.

నిస్వార్ సింగ్ వేపు శాంతి మందస్మిత వదనంతో చూస్తూ "శెహభాష్!... భారత వీరుడు మాట్లాడవలసిన తీరులోనే నువ్వు మాట్లాడేవు. నీ వీరత్వం నన్ను ఉత్తేజితురాల్ని చేస్తోంది!" అని కొంచెంసేపు మౌనంగా ఊరుకొని "మీరంతా కలసి రూపొందించిన ఈ విప్లవ పథకంలో నిర్మూలాత్మక దృష్టి ఉన్నంత ఆకర్షణీయంగా నిర్మాణాత్మక దృష్టి లేదేమోనని నేను భావిస్తున్నాను. ఆంగ్లేయుల పరిపాలనను అంత మొందించే విషయంలో భారతీయులెవ్వరూ వ్యతిరేకులు కారు. కాని ఆంగ్లేయుల పరిపాలన అంతమొందించిన తరువాత భవిష్యత్తుకు సంబంధించిన మీ పథకం సవ్యంగా రూపొందించబడలేదని నా అభిప్రాయం!... భారత దేశం మళ్ళీ ఛిన్నాభిన్నమై మొగలులు, మరాఠీలు, రాజపుత్రులు వారి వారి పరిపాలనే ఈ భారత దేశంలో మళ్ళీ కొనసాగించాలంటారా? ఏ పరిస్థితుల పట్ల భారతీయులు ఎంతో విసుగెత్తి విదేశీయుల ప్రవేశంపట్ల, వారి ఆధిపత్యంపట్ల ఉదాసీనత వహించారో అవే పరిస్థితులు మళ్ళీ పునరావృత్తం కావడానికే అయితే ఈ రక్తపాతమంతా అనవసరం!... పాటలీపుత్ర సామ్రాజ్యం విచ్ఛిన్నమైన తరువాత ఆ మూలనుండి యీ మూల వరకు యావద్భారతము బ్రిటీషు ప్రభుత్వంవంటి శక్తివంతమైన నాయకత్వములో ఎన్నడూ ఉండలేదు!... ఈ విషయాన్ని దృష్టిలోఉంచుకొని అఖండ భారత దేశాన్నంతటిని పరిపాలించగలిగే మహత్తరమైన సుసంఘటితమైన శక్తిని మనము సంపాదించుకోవాలి. అంతవరకూ తొందరపడకూడదు.

భారత దేశంలో జాతీయ సమైక్యత మనము మొదట సాధించాలి. జాతీయ సమైక్యత అంటే చెదరివున్న ఆధ్యాత్మిక శక్తులను సమీకరించడమన్నమాట ! ... ఒకే ఒక ఆధ్యాత్మిక లక్ష్యాన్ని స్పందించే హృదయాల సమైక్యంలోనే జాతీయత యిమిడి వుంటుందనే సత్యాన్ని ఎన్నడూ విస్మరించకూడదు. మనం ఆంగ్లేయులను జయించాలీ అంటే ముందుగా జాతీయ సమైక్యత సాధించాలి!" అని ఉద్విగ్నురాలై అంది శాంతి.

ఆమె ఎంత దూరదృష్టితో యిలా అందో నిస్వార్ సింగ్ కొంతవరకు అర్థం చేసుకోగలిగేడు.నాలుగు కోట్లమంది ఆంగ్లే యులు సుమారు ముప్పది కోట్లమంది వున్న భారతీయులను ఎలా లొంగదీసుకోగలిగేరని తనను తాను ప్రశ్నించుకున్నాడు.

ఆనాడు భారతీయులు యీర్ష్యా అసూయలతో మహా స్వార్థపరులై ఆర్య ద్రావిడ, బ్రాహ్మణాబ్రాహ్మణ, శైవ వైష్ణవాది విభేదాలతో తలకొక ఊహతో ముక్కలకన్నా అన్యాయంగా కాట్లాడుకుంటుండేవారు. అందుచేతే ముప్పది కోట్ల భారతీయులను విదేశీయులు అవలీలగా జయించ గలిగేరు.

ఆంగ్లేయుల నెదిరించి విజయ లక్ష్మిని చేపట్టాలంటే శాంతి చెప్పినట్లు భారతీయులలో జాతీయసమైక్యత ముందుగా సాధించవలసి వుంటుందని నిస్వార్ సింగ్ గ్రహించ గలిగేడు. "బాగా ఆలోచించిచూస్తే యెంతో దూర దృష్టితో శాంతి యీ మాటలంటున్నట్లు అనిపిస్తోంది."అన్నాడు నిస్వార్ సింగ్.

తనను కొంతవరకు అర్థం చేసుకున్న నిస్వార్ సింగ్ వేపు యెంతో ఆనందంతో చూసింది శాంతి.

ఆమె చూపులో చూపు కలిపేడు నిస్వార్ సింగ్.

సైనికులలో రెచ్చగొట్టబడిన వీరావేశం కాస్తా చల్లారు తూండడం గమనించేడు కుమర్ సింగ్ ! ... శాంతి వేపు ఎంతో ఆప్యాయంగా చూస్తూ "శాంతి ! ... ప్రస్తుతం మనము యే స్థితిలో ఉన్నామో గ్రహించలేనంతటి అమాయకుణ్ణి కాదు నేను ! ... నిద్రాణమైవున్న మన జాతిని మేల్కొలిపి కర్తవ్యాన్ని ప్రబోధించడంకోసమే యీ విప్లవం ఉద్దేశించబడింది. కొన్ని వేలమంది భారతీయుల రక్త తర్పణాలతో జాతీయ సమైక్యం తప్పక సిద్ధిస్తుందని నా నమ్మకం.

జయాపజయాల మాటెలాగున్నా యీ విప్లవ జ్వాల భారతీయులందరిని స్వధర్మ రక్షణాకై కంకణధారులను చేసి స్వాతంత్ర్యాభిలాషను కలుగజేస్తుంది. జాతికి నూతన చైతన్యాన్ని చేకూరుస్తుంది. ఒక వేళ దురదృష్టవశాత్తు అపజయమే సిద్ధిస్తే యిది భారతజాతికి మరింత మహత్తరమైన శక్తిని స్ఫూర్తిని యిస్తుంది. శాంతియుతమైన పద్ధతులలో ఎటువంటి క్లిష్టసమస్యనైనా పరిష్కరించుకోవాలనే అభిలాష అశాంతియుతమైన ఒక మహా సంగ్రామానంతరమే సాధారణముగా మానవులకు కలుగుతుంది !...

మన సైనిక బలం ఎంత శక్తివంతమైనదో వారి కొకసారి చూపిస్తే ఆ తరువాత శాంతియుతమైన సంప్రదింపులకు

వాళ్ళంతట వాళ్ళే దిగివస్తారు. మొదటనుంచీ శాంతియుతమైన సంప్రదింపులంటే వాళ్ళు లొంగిరారు. మనం స్వతహాగా శాంతి కాముకులమేఅయినా స్వధర్మ రక్షణకోసం, జాతిని సుసంఘటిత పరచడంకోసం ఈ రక్తపాతం అనివార్యం! ... అందుచేత నీ ప్రబోధాలతో యీ జాతీయ విప్లవ సంఘాన్ని ప్రభావితం చెయ్యకు. నీకు చేతనైతే ఒక పనిచెయ్యి! ... ఇప్పుడు మన జాతిలో రెండు రకాల మనుష్యులున్నారు. సంకుచిత దృక్పథం వల్ల, అజ్ఞానంవల్ల నేటిసమాజానికి ఎందుకూ పనికిరాని, కుళ్ళు కంపు కొడుతున్న కొన్ని బూజుపట్టిన సంప్రదాయాలను పట్టు కొని వ్రేలాడుతున్నవారు మొదటి రకం!... కాలానుగుణంగా మన పాత పద్ధతులలో కొన్నింటిని మార్చుకోవలసిన అవసర ముందని యిటువంటివాళ్ళకు బాగా నచ్చచెప్పాలి.

ఇకపోతే రెండోరకం; నవ్యతా వ్యామోహంతో పాశ్చాత్య నాగరికతను అనుకరించడమే అభ్యుదయమనుకొనేవాళ్ళు! ... పాశ్చాత్యుల భౌతిక నాగరికతను చూసి అబ్బురపడి ఆధ్యాత్మి కత్వాన్ని విడిచిపెట్టి భారతీయ సంస్కృతిని విస్మరిస్తే: అనతి కాలంలోనే మన జాతి సర్వనాశనమయిపోతుందనే భయంకర మైన సత్యాన్ని ఈరకమైనవాళ్ళకు తెలియజెయ్యి!...ఇక ఏపీ జాప్యం చెయ్యకుండా నువ్వీ పనికిపూనుకో!... వెళ్లు!... నువ్విక మా విప్లవ మార్గానికి అడ్డురాకు!" అంటూ గుఱ్ఱాన్ని అది లించేడు కుమర్ సింగ్.

"హర హర మహాదేవ ..." అంటూ ఆ సేనావాహిని షోన్ నదీ తీరం వెంబడి బీహార్‌లోని పశ్చిమారణ్యాలవేపు సాగిపోయింది.

శాంతి నిశ్చల నీరస నిర్నిమేష లోచనాలతో ఆ సేనా వాహిని కనుమరుగయ్యేటంతవరకు నిర్ఘాంతపోయిచూస్తూ నిల బడిందక్కడ. కనీసం నిస్వార్ సింగ్ అయినా తనకు తోడుగా మిగిలి వుంటాడని ఆశించిందామె. కాని ఆమె ఆశించిన విధంగా జరగలేదు.

♦ ♦ * ♦

తూర్పు అయోధ్యలో చెల్లాచెదురుగావున్న విప్లవ కారుల నందరిని సమీకరించి అట్రోలియా కోటకు సమీప ములో శిబిరం వేశాడు కుమర్ సింగ్.

అట్రోలియా అజీమ్‌ఘర్‌కు పాతిక మైళ్ళ దూరంలో వుంది. కుమర్ సింగ్ అట్రోలియా కోటకు చాలా దగ్గరలో ఉన్నాడని విని మిల్మన్ నేతృత్వంతో ఆంగ్లేయ సైనికులు హఠాత్తుగా వెళ్ళి కుమర్ సింగ్ సైన్యాలను ఎదిరించేరు.

కుమర్ సింగు సైనికులు అతి ధైర్య సాహసాలలో ఆంగ్ల సైనికులను చుట్టుముట్టి వారిని ఉక్కిరి బిక్కిరి చేసేరు. ఆంగ్ల సైనికులు హడిలిపోయి ప్రాణ భీతితో వెనుకకు పారిపో సాగేరు. వారి యీ బలహీనత కుమర్ సింగుకు నూతనోత్సా

హాన్ని, ధైర్యాన్ని చేకూర్చింది, దృక్పథంలోపడిన ఆంగ్ల సైనికులను కాల్చివేయుచూ, వారి ధళాలను తుత్తునియలు చేయుచూ అజీమ్‌ఘుర్ వరకు వారిని తరిమికొట్టేరు.

ఈలోగా వారణాసి, ఘాజీపూర్‌లనుంచి మిల్మాన్‌కు సహాయపడేనిమిత్తమై కలనల్ డేమ్సు నేతృత్వంతో మరికొంత సైన్యం వచ్చింది.

అయినా కుమర్ సింగ్ అధైర్యపడలేదు.

మిల్మాన్‌కు పట్టినగతే డేమ్సుకుకూడా పట్టింది!

కుమర్ సింగు సైన్యాలు విజయభేరి మ్రోగించుచూ అజీమ్‌ఘుర్‌లోకి ప్రవేశించేయి. అక్కడ నుంచి విజయోత్సాహంతో వారణాసివేపు పురోగమించసాగేయి.

ఈ పరాజయ వార్త గవర్నరు జనరల్ కావింగుకు తెలిసింది. అతను అవమాన భారంలో ఉడికిపోయి క్రిమియన్ సమర వీరుడైన లార్డుమార్క్‌కేర్‌ను పిలిచి కుమర్ సింగ్‌ను అజీమ్‌ఘుర్‌వద్ద ఎదుర్కొనవలసినదని ఆజ్ఞాపించేడు.

కుమర్ సింగు ఆనాడు అతులిత ధైర్య సాహసాలతో రణరంగమంతా తానై భాసించి అతి చాకచక్యంతో ఆంగ్లేయ సైన్యాల వెనుకకుచేరి ఉన్న కొద్దిపాటి తుపాకులతోను అగ్ని వర్షాన్ని కురిపించసాగేడు.

ఆ భయంకరమైన అగ్నివర్షానికి తట్టుకోలేక ఆంగ్లేయులు చెదిరిపోయేరు. పరిస్థితి విషమించడంతోనే మార్క్‌కేర్

మిగిలివున్న కొద్దిపాటి సైనికులతోను రణరంగాన్ని వదిలి పారిపోయేడు. వారు వదిలిపెట్టిపోయిన ఆయుధాలను కుమర్ సింగు స్వాధీనం చేసుకున్నాడు.

అజీమ్‌ఘర్‌ను విముక్తం చెయ్యడానికి అవకాశంకోసం ఆంగ్లేయ సైన్యాలు ఎదురు చూచుచున్నాయన్న సంగతి కుమర్‌సింగ్‌కు తెలుసు! ...

అజీమ్‌ఘర్ వద్దనున్న ఆంగ్లేయులను ఆదుకొనేటందుకై కొంత సైన్యంతో జనరల్ లూగర్డు వస్తున్నాడన్న సంగతి గూఢచారులద్వారా కుమర్ సింగ్ తెలుసుకున్నాడు. తానునది వంతెనపై నుండి ఆ సైన్యం రావలసివుంది. అందుచేత మృత్యు భయంలేని మహావీరులను కొందరిని తన సైన్యంలోనుంచి ఏరి తానునది వంతెనపై కాపలాగావున్న ఆంగ్ల సైనికులను తరిమివెయ్యమని ఆదేశించి పంపేడు.

ఇది ఒక మహాద్భుతమైన రణ వ్యూహం! ... అజీమ్ ఘర్‌ను రక్షించుకొనేటందుకు విప్లవకారులు వంతెనపై దృష్టి సారించేరు కాబోలని ఆంగ్లేయులను భ్రమింపజేసి వారి దృష్టిని సైన్యాన్ని అక్కడ కేంద్రీకరింపజేసి, తను జగదీశ్‌పూర్ వేపు కొంత సైన్యంతో శీఘ్రగతినిపోయి దానిని స్వాధీనం చేసుకోవాలనేది అతని ఉద్దేశ్యం!

కుమర్‌సింగ్ అజీమ్‌ఘర్ వదలి సురక్షితముగా ఘాజీ పూరు దారికి చేరేడనే సంకేతం వచ్చేటంతవరకు వంతెనను అంటిపెట్టుకొనివున్న వీరాధివీరులు దానిని ఆంగ్ల సైనికులకు

క్షణకాలమైనా వశం కానివ్వలేదు. అతులిత ధైర్య సాహసాలతో వంతెనలో ప్రతి అంగుళాన్ని రక్షిస్తూ నిలచేరు! ... కుమర్‌సింగ్ ఘాజీపూర్ మార్గము చేరుకున్నాడని తెలిసేక విజయోత్సాహముతో తిరోగమించి కుమర్‌సింగును కలుసుకున్నారు.

కుమర్‌సింగు యిలా అతి చాకచక్యంతో తప్పించుకుపోయేడని తెలుసుకొని ఆంగ్లేయులు నిర్ఘాంతపోయేరు. అతన్ని పట్టుకోవడానికి ఘాజీపూర్ వేపు తమ సైన్యాలను నడిపించేరు. కాని కుమర్‌సింగ్ పట్టుబడలేదు.

ఆ మహావీరుడు గంగానదిని దాటుతుండగా ఆంగ్లేయులతనిని ఎదుర్కొన్నారు.

తుపాకుల భీకర శబ్దాలతో ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనించసాగింది! నదీ మధ్యస్థంలో ఉండడంచేత శత్రువులను తగినంత శక్తితో కుమర్‌సింగ్ ఎదుర్కోలేకపోయేడు. ఒకతుపాకీగుండు రయ్‌మనివచ్చి అతని మణికట్టుగుండాదూసుకుపోయింది. ఎనుబదేండ్ల ఆ వృద్ధవీరుడు దానినికూడా లక్ష్యపెట్టలేదు! మణికట్టు అడ్డంగా వ్రేలాడుతూండేసరికి తన రెండవ చేతితో ఖడ్గాన్ని పట్టుకొని మోచేతివరకూ తెగనరికి "ఓ గంగాభవానీ! ... నీ ప్రియసుతుడు నీకిచ్చే ఈ ఆఖరి కానుకను హృదయపూర్వకంగా స్వీకరించమ్మా!" అంటూ దానిని గంగామాయికి అర్పణచేసి ఆవలిగట్టు చేరేడు.

ఆ తరువాత కుమర్ సింగ్ షహాబాద్ అరణ్యాలగుండా తన పూర్వ రాజధాని అయిన జగదీశ్ పూర్ సమీపించేడు.

ఈలోగా అక్కడ కుమర్ సింగ్ సోదరుడైన అమర్ సింగు నిర్ణీతవ్యూహం ప్రకారం అక్కడున్న ఆంగ్లేయులందరిని ఆ రాత్రికిరాత్రే మట్టుబెట్టి కుమర్ సింగు రాజధానిలోకి సురక్షితంగా ప్రవేశించడానికి అవసరమయ్యే ఏర్పాట్లన్నీ చేసేడు.

కుమర్ సింగు ఏ రాజధానినుంచయితే అన్యాయంగా, అక్రమంగా ఎనిమిది మాసాలక్రితం తరిమివేయబడ్డాడో అదే రాజధాని అయిన జగదీశ్ పూర్ లోకి అత్యద్భుతంగా, ఆకస్మికంగా వీరోచితంగా ప్రవేశించేడు!

విశేషం ఏమిటీఅంటే జగదీశ్ పూర్ పై కావలాగా ఆగ్రాలో ఉంచబడిన ఆంగ్ల సైనికులకీ వార్త మూడు రోజుల తరువాతగాని తెలియలేదు. ఈ పరాజయవార్త తెలిసేక ఆదరాబాదరాగా జగదీస్ పూరుపైకి దాడివెడలేరు!... అప్పటికే బాగా అలసిపోయి వున్నప్పటికీ కుమర్ సింగు సైనికులు ఆంగ్ల సైనికులతో వీరోచితంగా పోరాడి వారిని దూరంగా తరిమివేసేరు.

నూతన్న వైభవముతో మళ్ళీ సింహాసనాన్ని అధిరోహించేడు కుమర్ సింగ్!

విధి ఎదురుతిరిగిన కారణంగా తిరిగి సంప్రాప్తమైన ఈ వైభవం అనతికాలములోనే అంతమొందింది. తెగిన చేతికి

వెంటనే తగిన వైద్యచికిత్స చేయించుకోనేటందుకు అవకాశం లేకపోవడంవలన అది కుళ్ళిపోయింది. ఆ మహావీరుడు ధనుర్వాతంచే శాశ్వతంగా కన్ను మూసేడు.

స్వీయ భవనంలో స్వేచ్ఛాపతాకంక్రింద 24-4-1858 తేదీని అమరుడయ్యేడు కుమర్ సింగ్.

ఆ మహావీరుని నిష్క్రమణానంతరం అంతటి శౌర్య ధైర్య సంపన్నుడైన అతని సోదరుడు రాజా అమర్ సింగ్ అతని స్థానాన్ని స్వీకరించేడు.

* ♦ ♦ ♦ *

అమర్ సింగ్ ఎంతటి శౌర్య సాహసాలుగల మహావీరుడో అంతటి ప్రజ్ఞావంతుడు. విప్లవోద్దేశాన్ని సామాన్య ప్రజల కందరకు తెలియజేసేటందుకై ప్రతిభావంతులైన విప్లవ వీరుల నెంతోమందిని నియమించేడు. వారిలో కొందరు జ్యోతిష్కుల వేషంలోను, కొందరు సాధువుల వేషంలోను, మరి కొందరు ఫకీరుల వేషంలోను, కొందరు వర్తకులవేషంలోను దేశంలో సంచరిస్తూ విప్లవ బీజాలు వెదజల్లసాగేరు ! ... ఈలోగా ఆంగ్లేయులు తమ సైనిక బలాన్ని మరింత అభివృద్ధి చేసేరు. బిహియా, హాతంపూర్, దలిపూర్ ప్రాంతాలలో విప్లవకారులపై అతితీవ్రంగా దాడిచేయ నారంభించేరు.

హాతంపూర్ ప్రాంతంలో నిస్వార్ సింగు నేతృత్వంతో నడుపబడుచున్న సైన్యం తీవ్రమైన పరాజయాన్ని పొందింది. ఎంతోమంది విప్లవవీరులు నిహతులయ్యేరు.

ఈ సంఘటనతో నిస్వార్ సింగ్ కాస్తా నిరుత్సాహపడి "ప్రస్తుత పరిస్థితిలో ఆంగ్లేయుల నెదిరించడమంటే మృత్యువును ఆహ్వానించడమే నన్నమాట!" అని అమర్ సింగుతో అన్నాడు.

"నీకీ పిరికితనం యెవరివల్ల ఎందుకు దాపురించిందో నాకు తెలుసు!... నువ్విప్పుడు శాంతికాముకుడవై యున్నావు! ఈ స్థితిలో విప్లవోద్యమానికి నువ్వెంతమాత్రం పనికిరావు. అందుచేత నిన్ని ఉద్యమంలోంచి తొలగిస్తున్నాను. శాంతి వనానికి వెళ్ళి అక్కడ హాయిగా శాంతితో కులుకు!...ఇక్కడ నుంచి తక్షణం వెళ్ళిపో!" అని శాసించేడు అమర్ సింగ్.

నిస్వార్ సింగు మారుమాటాడలేదు!

అతి నిశ్శబ్దంగా శాంతివనానికి వెళ్ళిపోయేడు!

అక్కడ నిస్వార్ సింగు కోసం వేయి కళ్ళతో యెదురు చూస్తోంది శాంతి!

తన ప్రియురాలిని చూడగానే అతని శరీరం ఆనందో ద్రేకంతో పులకించింది!... ఆమెను బిగియార కౌగలించుకొని "శాంతీ! ... ఇక నీ సహచర్యంలో నా యీ జీవిత శేషాన్ని ఏ చీకూ చింతా లేకుండా హాయిగా ఆనందంగా గడిపేస్తాను." అని అన్నాడు.

ఆమె అతని విశాలమైన నేత్రాలలోకి ప్రేమతో చూస్తూ "ఈ శాంతి నిన్నెందుకింత అధికంగా ప్రేమిస్తోందో తెలుసా ?" అని అడిగింది.

"నా పూర్వజన్మసుకృతంవల్ల" అని సమాధానమిచ్చేడు నిస్వార్ సింగు.

శాంతి తన మృదువైన హస్తంతో ఆతని వక్షస్థలంపై ప్రేమతో నిమురుతూ, "ఎన్ని కష్టనష్టాలు వచ్చినా యీ శాంతిని నువ్వెన్నడూ విడిచిపెట్టవుకదూ ?" అనడిగింది.

"ఇక నిన్నెన్నడూ విడిచిపెట్టను. ఇక నా సర్వస్వం నువ్వే !... నువ్వు నా మనోరాజ్ఞివి. నిన్నువిడిచి నేనిక ఒక్క క్షణమైనా జీవించలేను." అని నిస్వార్ సింగ్ అనేసరికి శాంతి అతని కౌగిలిలోంచి మెల్లగా తప్పించుకొని కాస్త దూరంగా జరిగింది.

ఆమె ఎందుకలా తన కౌగిలిలోంచి తప్పించుకొని దూరంగా జరిగిందో నిస్వార్ సింగుకు అవగతంకాలేదు. తెల్లబోయి ఆమెవేపు ప్రశ్నార్థకంగా చూడసాగేడు.

శాంతి అతని ముఖములోకి నిశితంగా చూచుచూ నిస్వార్ సింగ్ !... ఇప్పుడు యీ శాంతి హృదయంలో భరించ శక్యం కానంతటి తీవ్రమైన అశాంతి దాగివుంది. నా యీ అశాంతికి హేతువు పరమ జుగుప్సాకరమైన దాస్యం. ఈ దుర్భర దాస్యంలోనుంచి విముక్తి లభించేటంతవరకు యీశాంతికి శాంతి

లేదు. భయంకరమైన రక్తపాతంతో కాకుండా శాంతియుతమైన పద్ధతిలో స్వాతంత్ర్య సమరాన్ని సాగించడమే నా లక్ష్యం. నా యీ లక్ష్యసాధనకు నువ్వు మనస్ఫూర్తిగా సహకరిస్తావనే ఆశతోనే నిన్నింతగా నేను ప్రేమిస్తున్నాను. ఏ లక్ష్యంతో నైతే నిన్ను నేను ప్రేమిస్తున్నానో ఆ లక్ష్యాన్ని సాధించేటందుకు నాతోపాటు నువ్వు యెన్ని కష్టాలనైనా ఓర్మితో సహించగలవని ఆశిస్తున్నాను." అందామె.

"శాంతియుత సమరమంటే ఏఁవిటి?... సమరమంటేనే అశాంతికదా? ... మరి శాంతి ఎక్కడ?... ఏఁవిటో నాఁకేవీ అర్థంకాలేదు." అన్నాడు నిస్వార్‌సింగ్.

ఆమె మెల్లగా నవ్వి "అర్థంకాలేదా? అయితే చెపుతాను విను. మనం యుద్ధంచెయ్యం. కాని సహాయ నిరాకరణం చేస్తాము. ఆయుధాలతో కాక వజ్రకఠినమైన మన ఆత్మబలంతో ఆంగ్లేయులను జయిస్తాం! ... అయితే ఈ పని చెయ్యడానికి ముందు దేశంలో చెల్లాచెదురుగావున్న జాతీయశక్తులన్నిటిని సమీకరించి సుసంఘటితపరచి జాతీయసమైక్యతను సాధించాలి. మాతృదేశ స్వాతంత్ర్య సముపార్జనకు శాంతియుత సమరమే మనకిక శరణ్యం!" అంది శాంతి.

ఆమె ధోరణి నిస్వార్‌సింగునకు అవగతంకాలేదు. శాంతియుత సమరమంటే ఏఁవిటో అతనికింకా బోధపడలేదు. శాంతి రూపొందించిన యీ పథకం నవ్వులపాలవుతుందేమోనని

భయపడ్డాడతను. కాని శాంతిని అతను మనస్ఫూర్తిగా ప్రేమి స్తూండడంచేత ఆ పథకాన్ని పాక్షికంగా ఆమోదించేడు.

♦ * * ♦

ఆంగ్లేయ సైనికులది పై చేయి అయిన సంర్భాలలో అమర్ సింగ్ తన సైన్యాలను అతి చాకచక్యంతో నలు దిక్కులకు చీలదీసి శత్రు సైన్యాలదృష్టిని చెదరగొట్టి నిర్ణీత పథకం ప్రకారం అకస్మాత్తుగా అనుకూలమైన ప్రదేశములో ఒక్కమారుగా ఆంగ్లేయ సైన్యాలపై గట్టి దెబ్బ తీస్తూండేవాడు.

చిత్ర విచిత్ర గతులలో అత్యద్భుతంగా అమర్ సింగ్ పోరు సలుపుతూండేవాడు. ఎంత అకస్మాత్తుగా రణరంగంలోకి ప్రత్యక్షమవుతూండేవాడో అంత అకస్మాత్తుగా మాయ మవుతూండేవాడు! ...

ఏదో మానవాతీతమైన అత్యద్భుత శక్తి అమర్ సింగు కున్నదేమోనని బ్రిటిష్ జనరల్ లూగర్డు అనుమానించేడు.

ఇట్లేకనిపించి అట్టే మాయమయ్యే శక్తిగల అమర్ సింగును నిర్జించడం యిక దుర్లభమని నిరుత్సాహపడ్డాడు లూగర్డు.

ఆ భయంకరారణ్యంలో ఒకానొకప్పుడు క్రూర మృగాలకు మాత్రమే నిలయమైయుండే కొండగుహాలన్నింటినీ విప్లవ వీరులతో నింపివేశాడు అమర్ సింగ్.

ఆత్మరక్షణోద్దేశ్యంతో ఆ అరణ్యంలో ఎన్నో పాతాళ మందిరాలను, సొరంగాలను యేర్పాటు చేయించేడు. శత్రువులు యేమరుపాటుగా ఉన్న సమయంలో నేల యీనిన విధంగా ఒక్కమారు నలు దిశలనుంచి చుట్టుముట్టి శత్రువులను నిర్జించుతూండేవారు అమర్ సింగు సైనికులు.

ఇక అమర్ సింగును జయించడం దుర్లభమనుకున్నాడు లూగర్డు. బాగా విసుగెత్తిపోయి నిరుత్సాహపడిపోయేడు. అవమానభారంతో క్రుంగిపోయేడు. అమర్ సింగుతో పోరాడడమంటే మృత్యువుతో పోరాడడమేనని గ్రహించేడు. ప్రాణం మీద తీపితో తన ఉద్యోగానికి రాజీనామా చేసి విశ్రాంతి అనే మిషపై ఇంగ్లండు వెళ్ళిపోయేడు లూగర్డు.

ఇక ఎలాగైనా ఈ మహా సమరాన్ని అంతమొందించాలనే పట్టుదలతో బ్రహ్మాండమైన ప్రయత్నంతో ఏడు పెద్ద సేనావాహినులను ఏడు వైపులనుంచి ఒకేసారి జగదీశ్ పూర్ వేపు నడిపించేడు బ్రిగేడియర్ డల్లాస్.

ఈ వ్యూహంలో అమర్ సింగ్ చిక్కుకుపోయేడు.

అప్పటికి మిగిలిన నాలుగు వందలమంది విప్లవ వీరులలోను మూడు వందలమంది 'సోనది' సమీపాన ఆంగ్లేయులను ఎదిరించి నిహతులయ్యేరు. ఆత్మాభిమానాన్ని కోల్పోయి ఎంగిలికూడు కాశించిన భారతీయులు కొంతమంది విప్లవ విద్రోహులై ఆంగ్లేయులపక్షం చేరడమే యీ అపజయానికి కారణం!

చివరకు మిగిలిన వందమంది విప్లవ వీరులు దెబ్బ తిన్న బెబ్బులులై ఆ మహారణ్యములో ఆంగ్ల సైన్యాలపై తిరగ బడ్డారు.

ఆఖరికి ముగ్గురుమాత్రం ప్రాణాలతో బ్రతికి బయట పడ్డారు. వాళ్ళలో ఒకడు ప్రచ్ఛన్న వేషంలోవున్న మహావీర అమర్ సింగ్.

ఆ వీర కిశోరం బాగా అలసిపోయింది. విశ్రాంతికోసం కైమూర్ పర్వతాలలోకి అతి నిశ్శబ్దంగా తప్పించుకుపోయింది. పట్టుకోనేటందుకై వెంటపడ్డారు ఆంగ్లేయ సైనికులు. కాని అమర్ సింగు వారికి పట్టుబడలేదు. అతనేమైనాడో యీ నాటి వరకు ఎవరికీ ఏమీ తెలీదు. అతను తన శేషజీవితాన్ని యెలా గడిపినది చరిత్రకందని విషయమైపోయింది!

విజయంపై విశ్వాసం సన్నగిలి కుమర్ సింగ్ రాజ వంశానికి చెందిన చాలామంది స్త్రీలు మందుగుండు సామా నుకు ఎదురుగా నిలచి దానికి నిప్పంటించుకొని ఆ బ్రహ్మాండ మైన ప్రేలుడులో తమ భౌతిక దేహాలను భస్మం చేసుకొని అమరజీవులయేరు.

ఈ ఘోరమైన రక్తపాతాన్నిచూసి శాంతి యెంతో హృదయవిదారకంగా విలపించింది. ఎలాగో అతి కష్టంమీద తనను తాను సంబాళించుకొని "నిస్సార్ సింగ్! ఈ సంగ్రామ ములో మనం ఎరివచే ఓడించబడ్డామో చెప్పగలవా?" అని అడిగింది శాంతి.

"ఇందులో చెప్పడానికేముంది ?... ఫలితం స్పష్టంగా కనిపిస్తూనేవుందిగా! ఆంగ్లేయులచేతుల్లో మనం ఓడిపోయేము" అన్నాడు నిస్సార్ సింగు.

"నువ్వు పొరబడుతున్నావు నిస్సార్ సింగ్ !... మనము ఆంగ్లేయుల చేతుల్లో ఓడిపోలేదు. మనలో జాతీయ సమైక్యత లోపించిన కారణంగా మనల్ని మనమే ఓడించుకున్నాము. ఆత్మాభిమానంలేని స్వార్థపరులైన కొంతమంది భారతీయులు యీ సమరంలో ఆంగ్లేయులపక్షం చేరడంవల్ల మన ఓటమికి మనమే కారకులమయ్యేమని నేను అభిప్రాయపడుతున్నాను." అంది శాంతి ఎంతో బాధతో.

నిస్సార్ సింగు బాగా కళ్ళుతెరచి శాంతివేపు చూసి "అవును శాంతీ! ... నువ్వన్నది నిజం!... మనల్ని మనమే ఓడించుకున్నాము. నువ్వెంతో దూరదృష్టికలదానివి. మాతృదేశ స్వాతంత్ర్య సముపార్జనకు నువ్వు రూపొందించిన పథకం నా కిప్పుడిప్పుడే అర్థమవుతోంది." అంటూ ఆమెను బిగియార కౌగలించుకున్నాడు.

— సమాప్తం —

[ఆంధ్ర ప్రభ సచిత్ర వారపత్రిక, 11-5-1966]

"1857 స్వారాజ్య సంగ్రామం" (స్వాతంత్ర్య వీర సావర్కార్) ఈ రచనకు ఆధారం.